సాక్షి ఏలూరు

గురువారం । 25 । జూలై । 2024



ఈ-క్రాప్ నమోదు ఎప్పుడో?

వరదకు వేలాది ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. ఇలాంటి తరుణంలో ఈ-క్రాప్ నమోదు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



డ్వాక్రా సీఏల తొలగింపు

ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొందరు వెలుగు సీఏ (వీఓఏ)లను తొలగించి, టీడీపీకి అనుకూలమైన వారిని ఆ స్థానంలో నియమించాలని హుకుం జారీ చేస్తున్నారు. 8లో ▸



ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ దందా

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ కర్రీ పాయింట్‌ను సీజ్ చేస్తామంటూ బెదిరించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన నలుగురు నకిలీ విలేకరులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పి.ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పి.ధాత్రిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన ఆమెకు ఇన్‌చార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి ఎం.ముక్కంటి, ఏలూరు, నూజివీడు రెవిన్యూ డివిజనల్ అధికారులు ఎస్‌ఎస్‌కె ఖాజావలి, వై.భవానీశంకరి, జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించేందుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం గుండ్లబావికి చెందిన ధాత్రి రెడ్డి 2019లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. పాడేరు సబ్ కలెక్టర్‌గా పని చేస్తూ జిల్లాకు జేసీగా బదిలీ అయ్యారు.

అమరావతికి నిధులపై స్పష్టనివ్వాలి

నూజివీడు: కేంద్ర బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి ఇచ్చింది రుణమా? గ్రాంటా? అనేది కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. నూజివీడులో బుధవారం ఆయన మాట్లాడుతూ రూ.15 వేల కోట్ల గురించి గొప్పలు చెప్పుకోవడం మానేసి రుణమా, గ్రాంటా అనేది తేల్చి రాష్ట్ర ప్రజలకు స్పష్టతనివ్వాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం అన్ని పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న డిమాండ్‌ను పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపు కేవలం 2.5శాతం మాత్రమేనని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో కోత పెట్టడమే కాకుండా విద్యావంతులైన యువతకు తక్కువ జీతంతో ఇంటర్న్‌షిప్ అందించేందుకు పథక రచన చేశారన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి



కేశవరం సచివాలయం వద్ద రైతుల ధర్నా

గణపవరం: కౌలు రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించాలని, లేదంటే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పెచ్చెట్టి నర్సింహమూర్తి అన్నారు. బుధవారం గణపవరం మండలం కేశవరంలో కౌలు రైతులతో కలిసి ఆయన ధాన్యం బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన నిర్వహించారు. మూడు నెలలుగా ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మరోవైపు వరదల కారణంగా నాట్లు నీటమునిగి రైతులు నష్టపోయారని అన్నారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థతో పాటు 7 పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్, దాని సమాన హోదా కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే నిమిత్తం సీనియారిటీ జాబితా బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్(తెలుగు, హిందీ)లో పదోన్నతులు కల్పించడానికి ఈ సీనియారిటీ జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు.

టీచ్ టూల్ ట్రైనింగ్ సెంటర్ తనిఖీ

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుందని దీనిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ ట్రైనింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి అబ్జర్వర్ తమ పాఠశాలల్లో బోధనా పద్ధతుల క్వాలిటీ పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందాలన్నారు.

గూడు లేదు.. గుక్కెడు నీరు లేదు

- పెద్దవాగు వరద గ్రామాల దుస్థితి
- అరకొర టార్పాలిన్ కవర్‌లు, మంచినీటి ప్యాకెట్‌లతో సరిపెట్టిన ప్రభుత్వం
- మూడు రోజులు భోజనం పెట్టి చేతులు దులుపుకున్న అధికారులు
- నేటికీ బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయని వైనం
- చెలమ నీళ్లే దిక్కు
- ఇళ్లకు నష్ట పరిహారం ఊసేలేదు



పెద్దవాగు ప్రవాహానికి ఆనవాళ్లులేని అల్లూరినగర్



అల్లూరినగర్‌లో వాగు చెలమనీళ్లు తీసుకెళ్తున్న గిరిజన మహిళలు

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని ఆ గ్రామాలకు ఆ రాత్రి కాళరాత్రే.. ఒక్క రాత్రిలో ఊళ్లన్నీ వరద ముంపులో చిక్కుకున్నాయి. పెద్దవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోవడంతో గ్రామాలన్నీ కన్నీటి సంద్రలయ్యాయి. మండలంలోని గ్రామాలను ఏటా పెద్దవాగు వరద ముంచేయడం పరిపాటి. అయితే ఈ సారి ఆనకట్ట తెగిపోవడంతో ఊహించని నష్టం జరిగింది. వరద నీటిలో ఇళ్లతో పాటు సర్వం కొట్టుకుపోయాయి. ఇంత నష్టం జరిగినా సహాయక చర్యలు మాత్రం అరకొరగా సాగుతున్నాయి. మూడు రోజులు మాత్రమే భోజనాలు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. మంచినీటి సరఫరా నిలిపివేయడంతో వాగు వెంట చెలమల నీరు తాగుతున్నారు.

ఒక్కసారిగా ముంచెత్తిన వరద

సాధారణంగా వరద వస్తే ముందస్తు హెచ్చరికలు చేస్తారు. సురక్షిత ప్రాంతాలకు తరలిపోయేందుకు, ఇంట్లో వస్తువులు సర్దుకోవడానికి కొంత సమయం ఉంటుంది. పెద్దవాగు ప్రవాహం ఒక్కసారిగా వచ్చి ఊర్ల మీద పడటంతో కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతపట్టుకొని పరుగులు తీశారు గిరిజనులు. ఇది ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పెదవాగు వెంట ఉన్న కమ్మరిగుడెం, అల్లూరినగర్, కోయమాధారం, రామవరం, ఉదయ్‌నగర్, రాళ్ళపుడి గ్రామాల దుస్థితి. కమ్మరిగుడెంలో మొత్తం 220 గిరిజన కుటుంబాలున్నాయి. ఇందులో కొన్ని పక్కాగృహాలు మినహా 165 ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. కేవలం 65 టార్పాలిన్ కవర్‌లు మాత్రమే పంపిణీ చేశారు. భోజన వసతి బుధవారం నిలిపివేశారు. అల్లూరినగర్‌లో 104 పూరిళ్లు ఉండగా, ఇందులో 18 ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి.

> **భోజన వసతి నిలిపివేశాం**
>
> కలెక్టర్ ఆదేశాల మేరకు భోజన వసతి, పునరావాస కార్యక్రమాలు నిలిపివేశాం. బియ్యం ,నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పంపిణీ చేస్తాం.
>
> – చెన్నారావు, వేలేరుపాడు తహశీల్దార్

మిగతావి పాక్షికంగా దెబ్బతిన్నాయి. కోయమాధారం గ్రామంలో 10 ఇళ్లు కొట్టుకుపోగా, 25 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రామవరం ఉదయ్‌నగర్‌లో 13 ఇళ్లు పూర్తోగ్గ దెబ్బతినగా 12 పాక్షికంగా, రాళ్లపుడిలో 3 పూర్తిగా 6 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ నెల 18న తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలోని పెద్ద వాగు ఆనకట్ట తెగిపోవడంతో వరద పోటెత్తింది. వంటసామాగ్రి, బట్టలు కూడా తీయలేకపోయారు. నిత్యావసర వస్తువులు, వందల క్వింటాళ్ళ ధాన్యం, బియ్యం, ఇతర వస్తువులన్నీ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి.

భోజనం నిలిపివేత

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆయా గ్రామాల గిరిజనులకు బుధవారం నుంచి భోజన వసతి నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి. బియ్యం, నిత్యావసర వస్తువులు నేటికీ పంపిణీ చేయలేదు. ఒకవేళ బియ్యం పంపిణీ చేసినా నివాస గృహం, వంట పాత్రలు లేకుండా వంట ఎలా? అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. మూడు రోజులు భోజనం పెట్టి చేతులు దులుపుకున్న అధికారులు ఇళ్లు కొట్టుకుపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చే ఊసే లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

చెలమ నీరే దిక్కు

అల్లూరి నగర్ గ్రామస్తులకు బుధవారం నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో చేరువలో ఉన్న వాగు చెలమనీరే తాగుతున్నారు. కోయమాధారం గ్రామంలో మంచినీటి సరఫరా నిలిపివేయడంతో గ్రామస్తులు చేతిపంపు నీటిని తాగుతున్నారు.

కట్టుబట్టలే మిగిలాయి



నా ఇల్లు కొట్టుకుపోయింది... ఏ సామాన్లు బయటికి తీయలేకపోయాను..రేషన్ కార్డు కూడా పోయింది. ఒంటిమీద బట్టలే మిగిలాయి. దాచుకున్న మూడు వేలు కొట్టుకుపోయాయి. ఇళ్లకు పరిహారం ఇవ్వకపోవడంతో ఇల్లు నిర్మించుకోలేకపోయాను. మేడేపల్లిలో తెలిసిన వాళ్ల ఇంట్లో తలదాచుకుంటున్నాను.

– కుంజా రాముడు, అల్లూరినగర్

టార్పాలిన్ కవర్ ఇచ్చి సరిపెట్టారు



బుధవారం భోజనం నిలిపివేసి కడుపు మాడ్చారు. వరదలో నా ఇల్లు కొట్టుకుపోయింది. ప్రభుత్వం ఒక టార్పాలిన్ కవర్ ఇచ్చింది. బియ్యం, నిత్యావసర వస్తువులు ఇవ్వడంలేదు. ఇంట్లో ఉన్న రూ.30 వేల నగదు, పదో తరగతి సర్టిఫికెట్‌లు, ఆధార్, రేషన్ కార్డులు, 3 ఎకరాల పొలంకు సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకం కొట్టుకుపోయింది.

– చిచ్చడి రమేష్ అల్లూరినగర్

నా గుడిసె కొట్టుకుపోయింది



నా గుడిసె అరకిలోమీటరు దూరం కొట్టుకుపోయింది. కట్టుబట్టలే మిగిలాయి. ఇంట్లో 3 క్వింటాళ్ళ బియ్యం, ఇతర వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. కూలికెళ్తే గాని కూడు దొరకదు. ఇళ్లకు డబ్బులు ఇవ్వలేదు. బియ్యం పంపిణీ చేయలేదు. మా బాధ ఎవరు తీరుస్తారు.

– కారం వెంకమ్మ

భోజనం ఆపేశారు



మా ఇంట్లో సామాన్లన్నీ కొట్టుకుపోయాయి. చివరకు కట్టుబట్టలే మిగిలాయి. ఉండటానికి ఇల్లు లేకపోవడంతో తాత్కాలికంగా ఇల్లు నిర్మించుకుంటున్నా. బుధవారం భోజనం ఆపేశారు. రేపటి నుంచి ఎలా బతకాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే మా పరిస్థితి నరకమే

– చిచ్చడి సహదేవుడు అల్లూరినగర్ , వేలేరుపాడు మండలం

ఢిల్లీ ధర్నాలో జిల్లా నేతలు



ధర్నాలో ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కారుమూరి సునీల్‌కుమార్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఢిల్లీలో జగన్‌తో మాజీ ఎమ్మెల్యే బాలరాజు

గణపవరం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న విధ్వంసకర దాడులను దేశంలో అందరి దృష్టికి తీసుకెళ్లేందుకే ఢిల్లీలో ధర్నా చేపట్టామని, ఈ కార్యక్రమం విజయవంతమైందని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఢిల్లీలో గురువారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యా రాజకీయాలు, దళితులు, మహిళలపై దాడులతో రాష్ట్రంలో భయానక వాతావరణం నెలకొందని, వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వం బాధ్యత విస్మరించి, దాడులను ప్రోత్సహించేలా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ సంఘటనలను రాష్ట్రపతి, ప్రధానితో పాటు దేశంలో ప్రముఖుల దృష్టికి తీసుకెళ్లాలన్న లక్ష్యం నెరవేరిందని, ఇలాంటి దాడులపట్ల అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ధర్నాలో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కారుమూరి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నా విజయవంతం

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలనపై ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ధర్నాలో బుధవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికీ టీడీపీ అరాచక పాలన వివరించేందుకు చేపట్టిన ధర్నా పూర్తిగా విజయవంతమైందన్నారు. దేశ నలుమూలల నుంచి అనేక మంది సంఘీభావం తెలిపారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

తూర్పుమెట్టకు కదిలిన యంత్రాంగం

సాక్షి స్పందన

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని తూర్పుమెట్ట గ్రామానికి బుధవారం జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యటించింది. బుధవారం 'సాక్షి' దినపత్రికలో 'నడి గోదావరిలో.. బిక్కుబిక్కుమంటూ' శీర్షికతో వార్త వెలువడిన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన అధికారులు గ్రామంలో మంచినీటి ప్యాకెట్‌లు, కూరగాయలు, కొవ్వొత్తులు, బిస్కెట్‌లు, మస్కిటో కాయిల్స్ పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా టార్పాలిన్ కవర్‌లు అందజేశారు. గ్రామంలో వైద్యాధికారి రాజీవ్ నేతృత్వంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అంటు వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



తూర్పుమెట్టలో కూరగాయలు, కొవ్వొత్తులు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ అద్దయ్య తదితరులు

మొత్తం 58 మంది గిరిజనులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చెన్నారావు, ఎంపీడీఓ శ్రీహరి, కుక్కునూరు సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద నష్టం రూ.187 కోట్లు

- ప్రాథమికంగా అధికారుల నిర్ధారణ
- వరద తగ్గాక పూర్తి స్థాయి నష్టం అంచనా
- 333 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు
- వేల ఎకరాల్లో పంట నష్టం
- 17 చెరువులకు గండి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు, వరదలకు రూ.187 కోట్ల మేర నష్టం జరిగింది. గోదావరి వరదల నేపథ్యంలో 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరద ప్రభావంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 321 ఇళ్లు దెబ్బతినగా, గొర్రెలు, పాడి పశువులు మృతి చెందాయి. జిల్లాలో 190 హెక్టార్లలో నారుమళ్లు దెబ్బతిన్నాయి. 2,554 హెక్టార్లలో పంట నష్టానికి గురైంది. 155 గ్రామాల పరిధిలో 3,288 మంది రైతులు నష్టపోయారు. 500 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 333 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా రూ.167 కోట్ల మేర రోడ్లు, భవనాల శాఖకు నష్టం వాటిల్లగా, 13 రోడ్లు పంచాయితీరాజ్ శాఖకు సంబంధించిన రోడ్లకు పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లింది. ప్రధానంగా పెదవాగు ప్రాజెక్టు వల్ల వేలేరుపాడు మండలంలో రామవరం రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అల్లూరునగర్ రోడ్డు సుమారు 20 కిలోమీటర్ల మేర కొట్టుకుపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు నుంచి కోయిదా వరకు వేలేరుపాడు–రుద్రమకోట రహదారి, కుక్కునూరు– అశ్వారావుపేట రహదారిలో రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వరకు, వినాయకపురం– రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు రహదారి పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరద ముంపులో రోడ్లు ఉండటంతో ఎంతమేర నష్టం వాటిల్లిందనేది తెలియాల్సి ఉంది.

వేలేరుపాడు మండలంలో భారీ నష్టం

మైనర్ ఇరిగేషన్ పరిధిలో 17 చెరువులకు నష్టం వాటిల్లింది. దీంతో రూ.3 కోట్ల నష్టం వాటిల్లింది. ప్రధానంగా పడమటి కాల్వ పూర్తిగా దెబ్బతింది. డిప్పకాయలపాడులోని రాజుచెరువు, కేతవరంలోని దున్నపోతుచెరువు దెబ్బతినడంతో ప్రస్తుతం నష్టం అంచనా వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పెద్దవాగు ప్రాజెక్టు గ్రామాలపై విరుచుకుపడటంతో 13 గ్రామాల పరిధిలో ఫిల్టర్ పాయింట్లు, మోటార్లు పూర్తి స్థాయిలో కొట్టుకుపోయాయి. దీనికి రూ.23 లక్షలు నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 22 గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఫిల్టర్ పాయింట్లు, మోటార్లు దెబ్బతిన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అధికారులు ప్రాథమిక అంచనా రూపంలో నివేదికలు సిద్ధం చేశారు. జిల్లాలో వరదలు, వర్షాలకు రూ.187 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వరద తగ్గుముఖం పడుతుంది. వరద తొలగిన తరువాత నష్టాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

జిల్లాలో స్వల్ప వర్షపాతం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా వ్యాప్తంగా స్వల్ప వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముసునూరు మండలంలో 3.0 మి.మి నమోదు కాగా, అత్యల్పంగా లింగపాలెం, ఏలూరు రూరల్, భీమడోలులో 0.4 మి.మి నమోదైంది. సగటున జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 0.6 మి.మి వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 14 మండలాల్లో వర్షం కురవలేదని తెలిపారు. ముసునూరు 3.0, అగిరిపల్లి 2.8, వేలేరుపాడు 2, నూజివీడు, కుక్కునూరు 1.6, జంగారెడ్డి గూడెం 1.4, పోలవరం 1.2, ఏలూరు అర్బన్, జీలుగుమిల్లి 0.8, బుట్టాయగూడెం, దెందులూరు 0.6 మి.మీ నమోదైంది.

వైద్య వృత్తికి వన్నె తేవాలి



అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): సమాజంలో వైద్యవృత్తికి ఉన్న గౌరవానికి మరింత వన్నె తెచ్చేలా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జిల్లాలో పారిశుధ్యం, వైద్యసేవలు, విద్య, తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నిర్దేశించిన సమయం వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సిబ్బంది హాజరు నూరుశాతం ఉండాలన్నారు. గర్భిణులు, పిల్లలకు వాక్సినేషన్ పూర్తిగా అందించాలన్నారు. వరదలలో చిక్కుకున్న కుక్కునూరు, వేలేరుపాడులలోని ప్రజలకు వైద్య సిబ్బంది ఉత్తమ సేవలందిస్తున్నారని, జిల్లాలోని మిగిలిన వైద్య సిబ్బంది వారిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. మలేరియా, డెంగ్యూ వైరల్ జ్వరాలు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపరచాలన్నారు. విద్యా కానుక కిట్లు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని, నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్‌తో డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అపారిశుధ్య పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



క్లుప్తంగా

కొత్త జేసీని కలిసిన ఎన్జీవో నాయకులు



జేసీ ధాత్రిరెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఎన్జీవో సంఘ నాయకులు

ఏలూరు (మెట్రో) : ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన పి.ధాత్రి రెడ్డిని బుధవారం ఏపీ ఎన్జీవోస్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జేసీని కలిసిన వారిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ఏలూరు తాలూకా ఎన్జీజీవోస్ అసోసియేషన్ నాయకులు కె.సత్యనారాయణ, నోరి శ్రీనివాస్, పూడి శ్రీనివాస్, నరేంద్ర, నారాయణ నాయుడు, బైగ్, గంగాధర్, మహిళా విభాగం సభ్యులు సునీత, సత్యభారతి, సత్యశ్రీ ఉన్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తే సహించేదిలేదు

ఏలూరు (టూటౌన్): సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ తాడేపల్లిలో పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఏలూరులో విలేకరులకు బుధవారం వివరాలను వెల్లడించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా సర్పంచ్‌ల హక్కులు కాలరాయడం దారుణమన్నారు. ముఖ్యంగా ఎస్సీ సర్పంచ్‌లపై ఆయా పంచాయతీలలో అధికార పార్టీ నాయకులు పెత్తనం చేయడం సరికాదన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి సర్పంచ్ హక్కులకు భంగం కలుగకుండా తక్షణం చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరినట్లు వెల్లడించారు.

బోనుకు చిక్కిన పునుగు పిల్లి



స్థానిక గంగానమ్మకోడు ప్రాంతంలో ప్రత్యక్షమైన పునుగు పిల్లి

ఆకివీడు: స్థానిక గంగానమ్మ కోడు వీధిలో బుధవారం ఒక బోనుకు పునుగు పిల్లి చిక్కింది. ఎలుకల కోసం ఈరి రమేష్ అనే వ్యక్తి ఏర్పాటు చేసిన బోనెలో పునుగుపిల్లి చిక్కి ఉండటాన్ని గుర్తించడంతో స్థానికులు అధిక సంఖ్యలో వచ్చి తిలకించారు. టీటీడీకి సమాచారం ఇచ్చినట్లు రమేష్ విలేకర్లకు తెలిపారు.

రైలు పట్టాల వద్ద వ్యక్తి మృతదేహం లభ్యం

మండవల్లి : రైలు పట్టాల వద్ద పడి ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. రైల్వే సిబ్బంది అజయ్‌కుమార్ రైల్వే ట్రాక్‌పై బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండవల్లి రైల్వేస్టేషన్ వద్ద రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉండటాన్ని గమనించి వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు బి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు ఎప్పుడో?

- జూలై ముగుస్తున్నా ఇప్పటికీ చేపట్టని కొత్త ప్రభుత్వం
- ప్రభుత్వ మార్గదర్శకాలు కోసం యంత్రాంగం నిరీక్షణ
- వరదలకు దెబ్బతిన్న పంటలపై అన్నదాతల్లో ఆందోళన
- గత ప్రభుత్వంలో ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు
- జిల్లాలో 2.19 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు
- ఇప్పటికే 93 వేల ఎకరాల్లో పూర్తయిన వరి నాట్లు



భీమవరం శివారులో వరి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

భీమవరం: జిల్లాలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న తరుణంలో భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో వరి నారుమళ్లు, నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంకా వేలాది ఎకరాల్లో వరి నాట్లు వరద నీట మునిగే ఉన్నాయి. ఇటువంటి తరుణంలో ఈ-క్రాప్ నమోదు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా పంటల సాగు సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది పంట పొలాల వద్దకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేసేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఈ-క్రాప్ నమోదు చేసే దిశగా చర్యలు కానరాకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదుపై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ-క్రాప్ నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని అంటున్నారు. గత ప్రభుత్వం రైతులకు కొండంత అండగా ఉండి రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ ధరకు ఎరువులు, పురుగుమందులు విక్రయించేంది. అలాగే ఈ-క్రాప్ నమోదు ద్వారా పంట సాగుకు ఎరువుల కొనుగోలు, పంట అమ్మకం, పంట నష్టం జరిగినప్పుడు పంటల బీమాకు ఈ-క్రాప్ ఉపయోగపడుతుంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న పంటల నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం ఆలస్యం చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

రైతులు వేసిన పంటను ఈ-క్రాప్ చేయించడం వల్ల పంటల బీమా వర్తిస్తుంది. పంట రుణాలు మంజూరవుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందుతుంది. పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు. జగన్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసింది. ఏటా సార్వా సాగు ప్రారంభమైన వెంటనే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు పంట సాగు చేసిన రైతులను పొలం వద్ద నిలబెట్టి పంటతో పాటు ఫొటో తీసి యాప్‌లో వివరాలు నమోదు చేసేవారు.

38 వేల ఎకరాల్లో నాట్లు మునక

జిల్లాలోని 20 మండలాల పరిధిలో దాదాపు 2.19 లక్షల ఎకరాల్లో సార్వా వరి నాట్లు వేయాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 93 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా 38 వేల ఎకరాలకు పైగా వరినాట్లు, నారుమడులు దెబ్బతిన్నాయి. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీ విత్తనాలు వంటివాటికి ఈ-క్రాప్ నమోదు లేకపోవడంతో తీవ్ర అడ్డంకిగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా ఇప్పటికే నాట్లు ఆలస్యం కాగా నారుమళ్లు దెబ్బతినడం వల్ల తిరిగి నారుమడి వేసి, నాట్లు వేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు సరఫరా చేస్తే రైతులకు కొంతమేరకు ఉపశమనం కలుగుతుందని, అయితే ఈ-క్రాప్ లేకపోవడం వల్ల ఎవరి నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నది వ్యవసాయశాఖ ప్రత్యేకంగా పరిశీలన చేయాల్సి ఉంటుందని, అదే ఈ-క్రాప్ నమోదై ఉంటే వెంటనే బాధితులను గుర్తించి ప్రభుత్వ ప్రయోజనం అందించే అవకాశం ఉండేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం స్పందించి ఈ-క్రాప్ నమోదుకు మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు.

మార్గదర్శకాలు రాలేదు



ప్రస్తుత సీజన్‌లో ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. గతంలో గ్రామస్థాయిలో నిర్వహించిన రీసర్వేలో కొన్ని ఇబ్బందులు ఉన్నందున వాటిని పరిష్కరించిన అనంతరం ఈ-క్రాప్ నమోదు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడగానే ఈ-క్రాప్ నమోదు చేపడతాం.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ఆధారాలు లేని 300 సెల్‌ఫోన్లు స్వాధీనం



ఏలూరులో ఓ షాపులో ఆధారాలు లేని ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరులోని సెల్‌ఫోన్ షాపులపై పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాలతో సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, టూటౌన్ పోలీసులు సెల్‌ఫోన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ చోరీలు భారీగా జరుగుతుండడం, చోరీ చేసిన ఫోన్లను దుకాణదారులు కొనుగోలు చేసి ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇలా కొన్న ఫోన్లు చోరీకి గురైనవి అని తీరా తెలియడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో తనిఖీల అనంతరం ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ నగరంలోని సెల్‌ఫోన్ షాపుల్లో తనిఖీలు చేశామని, వాటిలో సరైన ఆధారాలు, పత్రాలు లేని సుమారు 300 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఫోన్లకు సంబంధించి ఎవరైనా వినియోగదారులు సరైన పత్రాలు చూపిస్తే వాటిని అప్పగిస్తామని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్ల రిపేర్లు, విక్రయాలు చేసే దుకాణదారులు విక్రయాలు, కొనుగోళ్లు చేయవద్దని హితవుపలికారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చట్టం మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు.

షూటింగ్‌లకు జంగారెడ్డిగూడెం అనుకూలం



మాట్లాడుతున్న దేవరకొండ పోలీస్‌స్టేషన్ చిత్రం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, డైరెక్టర్, పీఆర్‌ఓ

జంగారెడ్డిగూడెం: సినిమా షూటింగ్‌లకు జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలు ఎంతో అనుకూలంగా ఉన్నాయని అనన్య చిత్రం డైరెక్టర్ బి.ప్రసాద్‌రాజు అన్నారు. హీరో సుమన్ ప్రధాన పాత్రలో నూతన నటీనటులతో నిర్మాణం జరుపుకున్న 'దేవరకొండ పోలీస్‌స్టేషన్' చిత్రం త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం జంగారెడ్డిగూడెంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్రం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, దేవరకొండ పోలీస్‌స్టేషన్ చిత్రంలో ముఖ్య పాత్ర పోషించిన ఉక్కుర్తి దుర్గారావుతో కలిసి డైరెక్టర్ ప్రసాద్‌రాజు సినిమా విశేషాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మహిళల కిడ్నాప్, రియల్ ఎస్టేట్ మోసాలపై ఈ చిత్రంలో దర్శకుడు వాస్తవ పరిస్థితులను తెలియజేస్తూ అన్ని వర్గాలను అలరించే రీతిలో సినిమా నిర్మించారని చెప్పారు. జంగారెడ్డిగూడెం, హైదరాబాద్ తరితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపినట్లు తెలిపారు. పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో సుమన్ తన సహజ శైలిలో నటించారన్నారు. త్వరలో దుర్గారావు నేతృత్వంలో 'ఫాల్స్' అనే కొత్త చిత్రాన్ని నిర్మించనున్నట్టు డైరెక్టర్ ప్రసాదరాజు వెల్లడించారు. ఉక్కుర్తి దుర్గారావు మాట్లాడుతూ దేవరకొండ పోలీస్‌స్టేషన్ మంచి సినిమా, దీన్ని విజయవంతం చెయ్యాలని కోరారు. పీఆర్‌ఓ శంకరరావు మాట్లాడుతూ అనన్య విజయంతో మరెందరో ఈ ఏరియాలో సినిమాలు నిర్మించేందుకు ఆసక్తిగా ఉన్నారని చెప్పారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక..



తీవ్రగాయాలైన లంక గ్రామానికి చెందిన బాలుడు

హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యంపై నిరసన

ఏలూరు టౌన్ : హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక ఓ బాలుడు తనపై స్వల్పంగా పెట్రోల్ పోసుకుని చేతిని కాల్చుకోవడమే కాక, పక్కనున్న మరో బాలుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. నగరంలోని సెయింట్ గ్జేవియర్ హైస్కూల్ హాస్టల్‌లో ఉండికి చెందిన ఓ బాలుడు 7వ తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడికి హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక ఏదొకటి చేసుకుని హాస్టల్ నుంచి బయటకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. దీంతో బాటిల్‌లో పెట్రోలును నింపి హాస్టల్‌కు తీసుకువెళ్లి ఉంచాడు. బుధవారం తెల్లవారుజామున తన చేతిపై పెట్రోలు పోసుకుని అంటించుకున్నాడు. స్వల్పగాయమైంది. ఇలా అయితే తనను బయటకు పంపరని, ఆలోచన చేసి పక్కనే పడుకుని ఉన్న లంక గ్రామానికి చెందిన బాలుడిపై పెట్రోలు పోసి నిప్పంటించినట్లు హాస్టల్‌లోని ఇతర బాలలు చెబుతున్నారు. తీవ్ర గాయాలు కావడంతో హాస్టల్ వార్డెన్, యాజమాన్యం సంస్థకు చెందిన హాస్పటల్‌కు తరలించి వైద్యం అందించారు. బాలుడు శరీరం 35 శాతం కాలినగాయమైనట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడికి తీవ్రంగా కాలిన గాయాలైనా సమాచారం ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లాడికి తీవ్ర గాయాలైతే హాస్టల్ యాజమాన్యం ఉదాసీనంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఏలూరు త్రీటౌన్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు ఇరుపక్షాలతో చర్చించారు. అయితే ఇరువర్గాలు ఒక అభిప్రాయానికి రాకపోవడంతో వారిని బయటకు పంపించి వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ యాజమాన్యం మాత్రం ఈ సంఘటనపై నోరుమెదపకుండా నిర్లక్ష్యంగా ఉండటంపై బాలుర తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం సహాయనిధికి 'శశి' విరాళం



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందిస్తున్న శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని శశి విద్యాసంస్థల తరఫున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందజేశారు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళం చెక్కు అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, శశి విద్యాసంస్థల డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ ఉన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తికి 4 ఏళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరు మహిళా కోర్టు ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి బుధవారం తీర్పునిచ్చారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరంలోని గుడిపూడి, బ్రడ్జిపేటకు చెందిన మద్దా ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి అదే పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ప్రవీణ్ అనుమతితో కువైట్ వెళ్లి అక్కడి నుంచి అతనికి పెళ్లి ఖర్చుల కోసం రూ.80వేలు పంపింది. ఆమె తిరిగివచ్చిన తరువాత మరికొంత సొమ్ము తీసుకుని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీంతో 2019లో జూన్ 7న బాధిత యువతి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ పి.చంద్రశేఖర్, ఏకే భగవాన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బుధవారం ఏలూరు కోర్టులో ఈ కేసు విచారణకు రాగా మోసం చేసిన వ్యక్తి ఎం.ప్రవీణ్‌కుమార్ (నాని) నేరం నిరూపణ కావడంతో అతనికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు తెలిపారు. బాధితురాలి తరఫున డీవీ రామాంజనేయులు వాదించారు.

దోడ్డిదారిన డ్వాక్రా సీఏల తొలగింపు

- వైఎస్సార్ సీపీ అనుకూల సీఏలే లక్ష్యంగా టీడీపీ నేతల హుకుం
- డ్వాక్రా సంఘాల సమావేశాలు నిర్వహించి మరీ తీర్మానాలు
- కీలకపాత్ర పోషిస్తున్న ఏపీఎంలు.. ద్వారకాతిరుమలలో వెలుగులోకి..



పంగిడిగూడెంలో డ్వాక్రా మహిళల సమావేశం

ద్వారకాతిరుమల: ప్రభుత్వం మారిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న కొందరు వెలుగు సీఏ (వీఓఏ)లను తొలగించి, తమ పార్టీకి అనుకూలమైన వారిని ఆ స్థానంలో నియమించాలని టీడీపీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. ఆ ఆదేశాలను వెలుగు ఏపీఎం తమ సీసీల ద్వారా అమలు చేయిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు టీడీపీ నేతలు ద్వారకాతిరుమల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వెలుగు సీఏలను టార్గెట్ చేశారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారన్న నెపంతో ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ జగన్నాథపురం, వేంపాడు, మెట్ట పంగిడిగూడెం, పంగిడిగూడెం, జి.కొత్తపల్లి గ్రామాల్లోని సీఏలను తొలగించాలని కొందరు టీడీపీ నాయకులు నిర్ణయించారు. ఆ బాధ్యతను ఓ ఏపీఎంకు అప్పగించారు. ఆమె సీసీల ద్వారా గ్రామాల్లో డ్వాక్రా మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేయించి, ఏదో ఒక సాకు చూపి ప్రస్తుత సీఏలను తొలగిస్తున్నట్టు తీర్మానాలు చేయిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే బుధవారం పంగిడిగూడెం ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద డ్వాక్రా మహిళలతో సీసీ సమావేశాన్ని నిర్వహించి సీఏలుగా వ్యవహరిస్తున్న ఇద్దరు మహిళలను మార్పు చేస్తూ సంఘ సభ్యులతో తీర్మానాలు చేయించారు. అయితే ఏ తప్పూ చేయని సీఏలను ఎలా తీసేస్తున్నారు.. అసలు ఇదంతా ఎవరు చేయిస్తున్నారని గ్రామ సర్పంచ్ ప్రతిపాటి యోహాను సీసీని ప్రశ్నించగా, టీడీపీ నాయకులు చేయమన్నారని, తమ అధికారిణి ఏపీఎం ఆదేశాల మేరకే ఇదంతా చేస్తున్నామని ఆమె సమాధానమివ్వడం గమనార్హం.

ఏపీఎం ద్వంద్వ వైఖరి

దీనిపై ఏపీఎంకు సర్పంచ్ యోహాను ఫోన్ చేయగా తానేమీ సీఏలను తొలగించమని చెప్పలేదని అన్నట్లు తెలిసింది. సీఏలను ఇంకా ఎందుకు మార్చలేదని టీడీపీ నాయకులు ఆమెను అడిగితే.. సీసీ తొలగించడం లేదని వారికి చెప్పి ఆమె తప్పించుకుని తమను ఇరికిస్తున్నారని ఒక సీసీ ఆవేదన వ్యక్తం చేస్తోంది. వాస్తవానికి ఏపీఎం ఆదేశాలు లేకుండా సీసీ ఏ నిర్ణయం తీసుకోవడానికి అవకాశం లేదు. తప్పు చేసిన సీఏలను తొలగించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించాలంటే ఏపీఎం స్వయంగా సంబంధిత డ్వాక్రా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి, తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సీసీల ద్వారా ఈ తతంగాన్ని చక్కబెట్టిస్తున్నారు. దీనిపై ఏపీఎం అరవిందమ్మను వివరణ కోరగా తాను ఈరోజు ఆఫీసుకు రాలేదని, సీఏల తొలగింపు విషయాన్ని మినిట్స్ చూసి చెబుతానని సమాధానమిచ్చారు.

ఏ తప్పూ చేయలేదు



నేను ఏ తప్పూ చేయలేదు. కావాలనే నన్ను సీఏగా తొలగిస్తున్నారు. టీడీపీ నాయకుల మాటలు విని వెలుగు అధికారులు ఇలా చేయడం దారుణం. డ్వాక్రా సంఘాలను బెదిరించి మరీ బలవంతపు తీర్మానాలు చేయిస్తున్నారు.

– లావూరి చిట్టెమ్మ, పంగిడిగూడెం, వెలుగు సీఏ

కక్షగట్టి చేస్తున్నారు



వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నామన్న నెపంతో కొందరు టీడీపీ నాయకులు కక్షగట్టి, నన్ను సీఏగా తొలగించాలని ప్రయత్నాలు చేశారు. ఏ తప్పూ చేయకపోయినా నన్ను తొలగిస్తూ వెలుగు అధికారులు డ్వాక్రా మహిళలతో బలవంతంగా తీర్మానం చేయించారు.

– బోరుగడ్డ రోజారాణి, పంగిడిగూడెం, వెలుగు సీఏ

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ దందా

- కర్రీ పాయింట్ నిర్వాహకుడిని బెదిరించి డబ్బులు వసూలు
- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- వెలుగులోకి వచ్చిన నలుగురు నకిలీ విలేకరుల బాగోతం



విలేకరుల నకిలీ గుర్తింపు కార్డులు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు

ఏలూరు టౌన్ : ప్రభుత్వ అధికారులమంటూ దుకాణదారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు నకిలీ విలేకరులను అరెస్టు చేసినట్లు ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం ఏలూరు రూరల్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో మండల అప్పలనాయుడు కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 22న ఒక మహిళ కర్రీ పాయింట్ వద్దకు వచ్చి తాను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంటూ దుకాణంలోని కూరల్లో ప్రమాదకరమైన రసాయనాలు కలుపుతున్నారనే సమాచారం వచ్చిందని, కర్రీపాయింట్‌ను సీజ్ చేస్తామంటూ బెదిరించింది. తమ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడాలంటూ ఒక వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడించింది. ఫోన్‌లో అతను కర్రీపాయింట్ యజమాని అప్పలనాయుడ్ని బెదిరిస్తూ దుకాణం సీజ్ చేయకుండా ఉండాలంటే రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడిన దుకాణం యజమాని తన వద్ద ప్రస్తుతం రూ.3,500లే ఉన్నాయని చెప్పగా, వాటిని తీసుకున్న మహిళ, మరో రూ.6,500 గంటలో పెదపాడు రోడ్డు మలుపులో తీసుకురావాలని చెప్పి వెళ్లిపోయింది. అనంతరం అప్పలనాయుడు డబ్బులు తీసుకువెళ్లి వారికి ఇచ్చాడు. ఆమె ఫోన్ నంబర్ ఇవ్వాలని కోరగా స్విచ్ ఆఫ్‌లో ఉన్న నంబర్‌ను అతని ఇవ్వడంతో అనుమానం వచ్చి ఈనెల 23న ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాలతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తీగలాగితే కదిలిన డొంక

కర్రీపాయింట్ దుకాణదారుని వద్ద డబ్బులు వసూలు చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎవరనే దానిపై ఏలూరు రూరల్ పోలీసులు విచారణ చేపట్టగా మీడియా ముసుగులో నకిలీ విలేకరుల పాత్ర బయటపడింది. చాటపర్రు గ్రామానికి చెందిన ముంగర వెంకట దుర్గ అలియాస్ ఘంటసాల దుర్గ నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఓ చానల్ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అధికారి పాత్ర పోషించిన హనుమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన బుక్కూరి దేవీప్రసాద్, మారుతీనగర్ ప్రాంతానికి చెందిన అగ్గాల ఉమామహేశ్వరి, ఎంఆర్‌సీ కాలనీకి చెందిన పులిగ రాంబాబులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా ఓ ఛానెల్ రిపోర్టర్లు, చానల్ డైరెక్టర్, కెమెరామెన్‌గా గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరి నుంచి రెండు మోటారు సైకిళ్ళు, గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ స్టేషన్ హెచ్‌సీ కే.సత్యారావు, కానిస్టేబుల్స్ పి.నాగరాజు, బి.చెన్నారావు, జి.అజయ్, మహిళా కానిస్టేబుల్ చైతన్యలను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, రూరల్ ఎస్సై కే.రాజారెడ్డి పాల్గొన్నారు.

సౌదీలో నరకం అనుభవిస్తున్నా.. కాపాడండి



జుబేర్

ఆగిరిపల్లి: ఎన్నో ఆశలతో సౌదీ వెళ్లిన తాను తినటానికి తిండి లేక నరకయాతన అనుభవిస్తున్నానని, కాపాడాలంటూ ఆగిరిపల్లికి చెందిన షేక్ జుబేర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఆగిరిపల్లికి చెందిన సలీము నిస్సా కుమారుడు జుబేర్ మూడు నెలల క్రితం బతుకు దెరువు కోసం సౌదీ అరేబియాలోని రియాదు నగరంలో ఒక వ్యక్తి దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్నానని మూడు నెలల నుంచి యజమాని జీతం ఇవ్వడం లేదని, జీతం అడిగితే దౌర్జన్యంగా పాస్‌పోర్ట్ లాక్కుని గదిలో బంధించి రక్తం వచ్చేలా కొట్టాడని, యజమానికి తెలియకుండా పారిపోయి తప్పించుకున్నానని, తిండి, నీరు లేక అల్లాడిపోతున్నానని చాలా భయంగా ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి తనను స్వదేశానికి తీసుకురావాలని వీడియోలో కోరాడు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ చెప్పారు. బుధవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం సూరపురాజుకాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్న భోగిరెడ్డి చంద్రయ్య ఇంట్లో గత నెల 22న చోరీ జరిగింది. ఈ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టణానికి చెందిన కోటపోతుల సత్యవరప్రసాద్, షేక్ బాషాలు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000- 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph : 9014885406 [HA-412]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185270]

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను ,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+ భోజనం. జీతం:17K.ఫోన్: 8520980099, 8520874499 [H-796258]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217 [M-1185366]

■ క్యాంపు సెంట్రల్ ప్రోగ్రామ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. విద్యార్హత : ఏదైనా డిగ్రీ, జీతం : 16,000 + 2,000 = 18,000/- ఫోన్: 7993945891. [A-762339]

■ Wanted B.Com / M.Com / MBA Finance / CA IPCC Dropouts to be work as field Executive in Bhimavaram / Tadepalli Gudem in a reputed Audit Firm. Interested persons (male only) Contact No. 70135 11502 for Further Information or mail to : kowthahr@gmail.com [B-173]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

